# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **తాడేపల్లిలోని మహనాడు ప్రాంతంలో వరద ముంపు నివారణకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.**
2. **గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**
3. **గిరిజన విద్యార్థులకు ఉత్తమ నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**
4. **సాగునీటి రంగానికి ప్రాధాన్యతనిస్తూ.. నీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.**
5. **శ్రీ సత్యసాయి జిల్లాలో ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందగా మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు.**

==========================

తాడేపల్లిలోని మహనాడు ప్రాంతంలో వరద ముంపు నివారణకు 300 కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణపనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని ఐటీ శాఖా మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. "మన ఇల్లు – మన లోకేష్" కార్యక్రమంలో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరి యర్రబాలెంలో స్థానికులకు ఇళ్ల పట్టాలను మంత్రి ఈరోజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, భూగర్భ డ్రైనేజి, గ్యాస్, విద్యుత్ కోసం ప్రత్యేక ప్రాజెక్టు మంజూరైందని చెప్పారు. జూన్ నుంచి ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ ఏడాది పూర్తయ్యేలోపు 3వేల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు అందచేయనుందని మంత్రి వివరించారు.

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో 14 కోట్ల రూపాయలతో చేపట్టనున్న దమయ్యపర్తి డ్రైనేజి పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. డ్రైన్ కాంక్రీట్ గోడ నిర్మాణ పనులను వర్షాకాలం వచ్చేలోపు పూర్తి చేస్తామని మంత్రి తెలియజేస్తూ...

వాయిస్ ..30 సెకన్లు

-------------------------

గిరిజన విద్యార్థులకు ఉత్తమ నైపుణ్యాలతో కూడిన విద్యను అందిస్తున్నామని ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను మంత్రి అభినందించారు. గిరిజన గురుకుల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం 80 శాతం, ద్వితీయ సంవత్సరం 91 శాతం ఉత్తీర్ణత సాధించారని, గతంలో కంటే మెరుగైన ఫలితాలు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు మంచి విద్యను అందిస్తున్నామని మంత్రి తెలిపారు.

-------------------------

తిరుపతి భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ –ఐఐటి ఆధ్వర్యంలో ఈ రోజు 5కె పరుగును నిర్వహించారు. ఏర్పేడులోని ఐఐటి ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 500మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటి అధ్యాపకులు నరసింహమూర్తి మాట్లాడుతూ, ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం అవసరమన్నారు. నిత్యం విద్య, సాంకేతిక పరిశోధనల్లో నిమగ్నమైన విద్యార్థుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలియజేస్తూ,

వాయిస్ ..25 సెకన్లు

-------------------------

సాగునీటి రంగానికి ప్రాధాన్యతనిస్తూ.. నీటి ప్రాజెక్టులన్నీ ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులను మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... శ్రీకాకుళం జిల్లా పాతపట్నం, టెక్కలి, పలాస నియోజక వర్గాల పరిధిలో ఉన్న 30 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఆఫ్ షోర్ రిజర్వాయర్ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారు. ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు.

-------------------------

శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలం ధనాపురంలో ఈ ఉదయం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందగా మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు.హిందూపురం–సిరా జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. గాయపడిన క్షతగాత్రులకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు.

-------------------------

కాగా ఈ ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన మరో 10 మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రమాద ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణ సమయాల్లో ప్రజలు రహదారి భద్రత నియమాలు పాటించాలని కోరారు.

-------------------------

బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారం లోపాలను తగ్గించేందుకు పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి వి.లక్ష్మీకాంతం తెలిపారు. భీమవరం మండలం రాయలం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషన్ పక్వాడ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పోషకాహార లోప నివారణపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహనా కల్పిస్తున్నామని లక్ష్మీకాంతం మాట్లాడుతూ,

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో భాగంగా వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

---------------------------

కర్నూలును పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని నగరపాలక మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. కర్నూలులో ఈరోజు ఆయన మాట్లాడుతూ, వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యమని అన్నారు. నగరంలో నిత్యం 947 మంది కార్మికులతో పరిశుభ్రత పనులను చేపడ్తున్నామని చెప్పారు. ఫిర్యాదుల కోసం ప్రజలు పురమిత్ర యాప్ ఉపయోగించాలని కమిషనర్ సూచించారు.

---------------------------

పర్యావరణహిత ఎరువులను ప్రోత్సహించవలసిన అవసరం ఉందని మేరీస్ స్టెల్లా కళాశాల వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విభాగాధిపతి లక్ష్మణ స్వామి తెలిపారు. విజయవాడలోని స్టెల్లా కళాశాలలో విద్యార్థులతో వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేయిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ స్వామి మాట్లాడుతూ, 40 నుంచి 50 రోజుల్లో వర్మీ కంపోస్టు తయారవుతుందని, ఈ ఎరువు పంటలకు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. పర్యావరణహిత ఎరువుల వినియోగం ద్వారా పర్యావరణంతో పాటు భూసారాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు.

======================